విధి విలాసము

సోమయాజుల వెంకటరామమూర్తి గారు

"డబ్బు యివ్వని విద్యదారిద్ర్య హేతువు; నేనెంత కష్టపడి, ఈ చిత్రకళ నేర్చుకున్నానో, ఎంతశ్రద్ధగా చిత్రములు సృష్టిస్తానో, ఆదేవుడికి తెలుసును! ప్రతీ వాళ్లూవచ్చి, 'జోగారావు పెయింటింగులో గట్టివాడు; అతనిచే రచింపబడిన చిత్తరువులు ఎంతస్వాభావికంగా వుంటాయి!' అని పొడిమాటలతో పొగడి నిష్క్రమించే వాళ్లేకాని 'పాటి ఆంధ్రుడు, చిత్రకళలో అభిరుచికలిగి తంటాలుపడుతున్నా'డని కనికరించి, ప్రోత్సహించి, నాచిత్తరువు ఒక్కటేనా, కొనినపాపాన్నిపోరు! డబ్బు లేకపోతే దినచర్య గడవడం కష్టంగావుంది!" అని, విసుగుదలతో జోగారావు తనయెదుట నేలపైకూర్చుండి వున్న తనభార్య, సరస్వతితో మాట్లాడుతూవుండెను.

"అయితే, మీరువెళ్లినకార్యం, పండా, కాయా? అని నేను వేరే అడగక్కర్లేదన్నమాటే" అని సరస్వతి పలికెను.

"కాయకాక పండైయేడుస్తుందా, నాకంటె ముందు పెద్దమ్మప్రయాణమై వస్తూంటేను?—ఈవెధవ చిత్రకళవల్ల, నాకీజన్మంలో జీవనోపాధి కలుగుతుం దన్నమాట కలలోనివార్త!" అని జోగారావుదైన్యంతో ప్రత్యుత్తరమిచ్చాడు. సరస్వతి, మనస్సులో నిరాశనుపైకి చూపకుండేటట్టు, మందహాసంతో, "క్రిందటి శనివారంనాడు చిత్రకళాసహాయకసంఘమువారి యాజమాన్యముక్రింద జరిగిన ప్రదర్శనములో, పురుషోత్తమ రావుగారు, మీచిత్తరువులుచూచి, అంతపొంగిపోయాడే మరి?" అని ప్రశ్నించింది. అందుకు జోగారావు, "అందుక నేకదూ, నేనూ ఆశపడి, అంతతొందరగా, అతని యింటికివెళ్లింది! తనకేమో, చిత్రకళలలో ఎంతో అభిరుచి వున్నమాట నిజమేకాని, నాచిత్తరువులలో ఒక్కటీ కూడా, ఆ మహానుభావుడికి రుచించలేదట! పోనీ, మరొకకారణం చెప్పి వెళ్లిపొమ్మన్నా, ఒక విధంగా వుండేది. పిడుగులాంటి యీజవాబు చెప్పేసరికి, నిలువున నీరైపోతున్నాను. నాకీవిద్యమీద అసహ్యంకూడా పుడుతోంది, చెప్పకేమి?" అని ఆగ్రహముతో పలికెను.

సరస్వతి— "మీబొమ్మలు నచ్చలేదా? ఏల? మీచిత్తరువులు చూచి ఎవ్వరు బాగులేవనగలరు!"

జోగారావు—"అయ్యో! వెర్రి మొగమా! నా చిత్రకళానైపుణ్యాన్ని వంటయింట్లోంచి నీవుమెచ్చుకొంటే, లాభమేముంది? నువ్వుసంతోషిస్తే నామనస్సుకి ఆనందమేకాని, ఈ అన్యోన్యపు పొగడ్తలతో, ఒక్క అర్ధరూపాయ లాభంలేదు. ఇన్నాళ్లూ మనయిద్దరకు ఏదోవిధంగా అన్నం, పప్పూ, ఒకగరిటెడు నేతిబొట్టు, పలచని మజ్జిగతో జరిగిపోయిందికాని, యిటుపైని మరి రెండు నెలలకి, అలాగు జరగడానికి వీల్లేదుకదా! రమణ పుట్టాక, అలాగు కాలక్షేపంచెయ్యలేం."

"రమణ" వారికి ముందు పుట్టబోయే బిడ్డ పేరు. పుట్టబోయేబిడ్డకి పేరేమిటి? అని చదువరులకి సందేహం అక్కర్లేదు. జోగారావు తల్లి పేరు రమణమ్మ. స్వర్గస్థురాలైన తల్లి స్మృతిచిహ్నంగా, ఆవిడ పేరుపెట్టడాని కప్పుడే నిశ్చయించాడు. మొగవాడైతే రమణరావు, ఆడపిల్లయితే 'రమణమ్మ' అని పిలవడానికి అతని యుద్దేశం. భర్తమాటలువిని, సరస్వతి మనసులో జనించిన సంతోషాన్ని ముసిముసినవ్వు మూలకంగా వ్యక్తపరచింది. ఆ నవ్వు సరస్వతియొక్క నునుపైన రెండుబుగ్గలమీద, రెండుపల్లములు విడిచి యంతరించింది. పిమ్మట, ఆమె, "మీ చిత్తరువులును, తక్కిన చిత్తరువులు తైఫారువేసి చూస్తే, మీ చిత్తరువులే యెంతో స్వభావసిద్ధంగా వున్నట్టు కని—"

జోగా—"అయ్యో, వెర్రిదానా! లోకంగుడ్డిది. ఈకాలంలో బాగూ ఓగూ ఎవళ్లకీ అక్కర్లేదు. నలుగురూ యేవస్తువు బాగుందంటే ఆవస్తువుకోసం బోర్లాపడి పోవడమేకాని, అందులోని మంచిచెడ్డ లెవళ్లకీ తెలుసు

కోవలసిన అవసరం లేదు. ఎవ్వడో ఒక అనామధేయం ముండాకొడుకు, పృష్ఠభాగం కనిపిస్తూ, ఒక పొట్టి కోటు తొడుకుంటే, ప్రతీవాడూ కూడా, క్రింద గూడ కట్టుకట్టుకుని, అలాంటి షార్టుకోటే వేసుగుని తిరగడమే కాని, దానివల్ల తన స్వరూపం ఎంత అసహ్యంగా వుందో అన్న ఆలోచనే లేదు. ఈ ఫేషన్సు అన్నీ ఇలాగు ఆచరణలోకి వచ్చినవే! ఈవిధంగా మన దేశంలో అందరూ తమ ప్రత్యేకవ్యక్తిత్వాన్ని బ్రద్దలు చేసుకుంటున్నారు. ఏం జెయ్యను? ఎడ్వర్టయిజుమెంటు దేనికెక్కువగా వుంటే, ఆపదార్థం మన దేశంలో వన్నెకెక్కి అందరికీ ప్రియమౌతూంది.

సర—సరే, ఆ ఎడ్వర్టయిజుమెంటు, ఆబహిరంగత మీ రెందుకు చెయ్యకూడదు?

జోగా—దానికి డబ్బుండాలి; నీవంటి సత్యకాలపుదాన్ని యెక్కడా చూడలేదు. మనకు డబ్బు లేకనే ఈయిబ్బందంతాను. 'ఆయనుంటే మంగలాడ్ని పిలుద్దు' రండిట వెనకటి కొకావిడ.

సర—డబ్బుఖర్చు లేకుండా ఎడ్వర్టయిజుమెంటు జరగాలన్నమాట—అనగా, ఎలాగైనా నలుగురి నోటా పడేమార్గం ఆలోచించాలి—ప్రకటన-బహిరంగము.

సరస్వతి ఆలోచనలో మునిగినది. తరువాత కొంత సేపునకు, "సరే, నేను చెప్పినట్టల్లా నడుచుకుంటారూ?" అని భర్తను ప్రశ్నించినది.

జోగా—అప్పుడే నీకేదో ఆలోచన తట్టినట్లుందే! ఏదీ, చెప్పు, చూతాం! డబ్బుఖర్చు లేకుండా మానవుని చేత సాధ్యమైనపని యేదైనా నేను చెయ్యడానికి సిద్ధంగా వున్నాను.

సర—మీరు కొంచం కష్టపడవలసివస్తుందేమో! మన మొకచిన్న ప్రదర్శనం, ఒక చిన్న కపటనాటకం ఆడాలి అందులో మీరూ నేను, పాత్రల మౌతాము. మీ పార్టుమాత్రం చాలా కష్టమని నాకుతోస్తుంది.

జోగా—అశ్రేఠ చెప్పి వేగం నా ఆశ్రుతపో గొట్టుదూ?

సర—మీకు బాగా యీతవస్తుందికదూ?

జోగా—ఈదుటే నా? అందు కభ్యంతర మేమి? చిన్నప్పుడు పందేలు వేసుకొని గోదావరిలో పన్నెండో స్తంభందాకా ఈది నాలుగుసార్లు ప్రథమబహుమతి కొట్టిన వాడ్ని—నీకేం తెలుసును, నాసంగతి?

సర—మీసంగతి నాకు తెలియకేం గాని—సరే, మీరొక్కసారి గోదావరిలో మునిగిపోయినట్టు నటించాలి.

జోగా—ఏమిటే?—నీమాట నాకర్థంకా లేదు.

సర—ఏమీ లేదు. మీరువంతెనమీంచి ప్రమాదవశాత్తు గోదావరిలో పడిపోయినట్లు నటించడం, నేను దుఃఖించి కేకలు వెయ్యడం, నలుగురూ రావడం, ఎవరో ఒకరు మిమ్మ ల్నొడ్డుకి తేల్చడం, మరునాడు న్యూసుపేపర్లలో ఫలానా ఆర్టిస్టు జోగారావుగారు గోదావరిలో పడడాన్ని గురించి పెద్దక్షరాల్తో పడడం; ఆమూలంగా, నలుగురికీ వెల్లడి—ఇది నాయొక్క ఉపాయం. మీకు నచ్చుతుందా?

జోగా—నీసూక్ష్మబుద్ధిని మెచ్చుకొనవలసినదే కాని. ఒకవేళ దెబ్బ బేజోటైపోయి, ఏదైనా ప్రమాదం సంభవిస్తే—

సర—అంతమట్టుకు మీకు ధైర్యంవుంటేనే, లేకపోతే వద్దే వద్దు.

జోగా—ధైర్యం లేకేం? హాస్యానికన్న ముక్కగాని. నువ్వు ధైర్యంగావుంటే, యిదెంతపని! అవలీలగా చేస్తాను; కాని దానివల్ల నలుగురుకీ వెల్లడి అవుతుందా? అని సందేహం.

సర—మీసందేహాలకీ, సమస్యలకీ అంతము లేదు. డబ్బుఖర్చు లేకుండా ఎడ్వర్టైజుమెంటు ఏలాగౌతుందో మీరే చెప్పండీ?

జోగా—సరే. ఎప్పుడు?

సర—ఎప్పుడో యెందుకు, ఈవాళ సాయింత్రమే. మనం మామూలుగా చల్లగాలికి వంతెనమీద నడిచి వెళ్లేటప్పుడు—అయిదుగంటలకి.

జోగా—అయితే సరే. కొంచం నాపార్టు గట్టిగావల్లించుకుంటాను. అని జోగారావు ఆలోచనామగ్నమానసుడైనాడు. సరస్వతి అప్రయత్నంగా భర్తను చేరబారింది. క్షణమాత్రం వారిరువురూ పరస్పరాలింగనము నందు పరవశులైరి.

౨

శుక్రవారంనాటి సాయంకాలం సుమారైదుగంటలకు గోదావరి వంతెనపై నడచుచుండినవారు తమతో కూడ వంతెనపై చల్లగాలికై వచ్చియున్న మనజోగారాయ సరస్వతులను జూచియుందురు. జోగారావు ముఖమునకు లేని దైన్యమును తెచ్చిపెట్టుకున్నాడు. సరస్వతి ఆతనిప్రక్కనే నడుస్తూవుండి, అనుకున్నసమయ మాసన్నమయిందని నిజంగానే భయభీతయై మెల్లగా అడుగులు వైచుచు భర్తవెంట వస్తూంది. ఇంతలో జోగారావు వంతెనప్రక్కనున్న చిన్నకమ్మిలపైనుండి తొంగిచూచి, "చాలాయెత్తుగానే వుంది!" అన్నాడు. "మీరింతవరకు వచ్చి వెనుక దీసేటట్టుందే" అని సరస్వతి అనినదే కాని, నిజము ఆతడు వెనుకదీయుటే ఉత్తమమని అంతరంగమున ఊహించింది.

జోగా—"వెనుకదియ్యడమేం? (నాలుగువైపుల కలయజూచుకొని) ఇదిగో—సరస్వతీ—"

* * *

పూర్వకాలపు నవలారచకులు చెప్పినట్లాయుత్తరక్షణమున, జోగారావు దభాలున గోదావరిలో ప్రమాదవశాత్తు? పడ్డాడు. పడడమే తడవుగా, సరస్వతి గొంతెత్తి అరచి, వంతెనమీద కూలబడింది. ఆమెదృష్టులన్నీ నదిలో తనభర్తపడిన ప్రదేశము వైపునకే మరలివున్నాయి. అరనిముషముపరకూ జోగారావుజాడ నీటిపైకానరాలేదు. సరస్వతి నిజంగానే భయపడ నారంభించింది. కాని, యింతలో జోగారావుశిరము నీటిపైభాగాన్ని కానవచ్చింది. తోడనే ఆమెప్రాణాలు కుదుటబడినవి. ఇంటివద్ద అనుకున్నరీతిగా జోగారావు నీటియందు రెండవమునక వేశాడు. అప్పుడు సరస్వతి, ఆనాటకంలోని తనపార్టును జ్ఞప్తికిదెచ్చుకొని, ఆస్తంభపుటంచుననున్న తీగలనానుకొని, "అయ్యో! సహాయపడండి, కాపాడండి! ఏమిదిక్కు?" అని తనయావచ్ఛక్తిని వినియోగించి, కేకవేసి, మూర్ఛజెందిన దానివలె క్రిందచదికిలపడింది. ఆమె రెండవసారి, ఆవిధముగా కేకవేయవలసిన యవసరమే లేకపోయింది. ఈవరకే జనులనేకులు గుమిగూడ నారంభించిరి. కాని, వచ్చినవారిలోనొక్కరును పడినవానిని కాపాడు నుద్దేశమును వ్యక్తపరచుటలేదు, సరికదా, ఎత్తయినప్రదేశముల వెదకికొని, నిలబడి, క్రింద నదిలో కొట్టుకుంటూన్న ఆమానవాకృతిని చూచి అస్వాభావికమైన సంతృప్తిని పొందుతూవున్నారు. వారియొక్క ఆడంబరము చూచి, సరస్వతికి పట్టరాని కోపంవచ్చింది. "నిజముగా ఆయనకి ఈతరానియెడల యేమైయుండును?" అనే ఆలోచన ఆమె హృదయంలో అత్యంతమైన ఖేదనను కలిగించుటచే యామె తనముఖమును రెండుచేతులతో మూసికొని, అచ్చట చేరియున్న వారినిజూచి, "అయ్యలారా! మీలో ఒక్కరైనా నాభర్తను కాపాడజాలరా?" అని దైన్యంగా పలికింది. ఈమాటవిని, ముందున్న మొగాళ్లు మెల్లగా వెనక్కి సర్దుకున్నారు. నడిబజారులో, మధ్యాహ్నపుయెండను, గారడీవిద్యచూస్తూ నిలబడి వున్నప్రేక్షకులు, కడకు గారడివాడు దమ్మిడీలు అడగడానికి సన్నద్ధుడౌతూవుంటే పలాయనబడ్డట్లు, సరస్వతివాక్యములు విన్నపిమ్మట జనం సన్నగిల్లారు.

ఇంతలోనొక బలశాలి, నిలిచివున్న జనులగుంపును భేదించుకుని, సరస్వతి ప్రక్కకువచ్చి ఆస్తంభముమీద నిలబడ్డాడు. క్రింద నదిలో తేలుచు, మునుగుచు, చూడడానికి ప్రాణావశిష్టుడై వున్న జోగారాయాకృతిని చూచాడు. వెంటనే పైనున్న అంగీ ఉత్తరీయం విడిచి, కచ్చనెగజెక్కి, క్షణమాత్రంలో వంతెనమీంచి, నదిలోకి గెంతాడు. దభాలునశబ్దం, మునక, ఒక్కఅరనిముషంలో తేలడం, నాలుగుబారలు—జోగారావును చేదుకున్నాడు. సరస్వతికి ప్రాణాలు చేరుకున్నాయి. "భేష్! భేష్" అని అందరూ చప్పట్లు చరచి, ఆ అపరిచితవ్యక్తియొక్క సాహసకృత్యాన్ని పొగిడారు. ఆపురుషుడు జోగారావుని సమీపించి, అతనికి సాహాయ్యం

చేస్తూ మెల్లిగా గట్టుచేరుస్తున్నాడు. అప్పుడు వంతెన మీదనున్న జనం రెండవసారి కెవ్వున కేకవేస్తూ, క్రొత్త వినోదం చూడనున్న బాలకులవలె గోదావరిగట్టున మెట్లవద్దకు పరుగెత్త నారంభించారు. వారితోపాటు సరస్వతియు, త్వరగా నడచిపోయి మెట్లరేవుచేరింది. "ఆవిడకి స్థలంవిడవండి," అని కొందరు, "దారివిడవండి, దారివిడవండి" అని కొందరు ప్రక్కకి ఒసులుకుని సరస్వతికి దారిచ్చినతోడనే, ఆమె జోగారావును సమీపించి భీతియుతదృక్కులను భర్తపైబరపి, "అంతయు సరిగానున్నద"ని సంతోషించింది — కాని, యామె యనుకొనిన రీతిని వార్తాపత్రికలకు సమాచారమంపువారేరీ?— ఎవ్వరూ కనబడలేదు.

ఇంతలో నొకపెద్దమనిషి ముందుకువచ్చి నిలచెను. అతని సూటు, బూటు, నేత్రములకు బంగారు సులోచనములు, అన్నియు జూచి, ఈత డొకన్యూసు పేపరు రిపోర్టరై యుంటాడని సరస్వతి ఊహించింది, కాని అప్పు డాతని జేబులోనుండి పైకి తొంగిచూచుచున్న రబ్బరుగొట్టమువలన అతడిని డాక్టరుగా నెరింగి, న్యూసు పేపరు రిపోర్టరు లింకా రాకపోయినందుకు నిరాశతోవుంది. వచ్చిన వైద్యశేఖరుడును, జోగారావును రక్షించిన, ఆనూతనపురుషుడును కొంచమునేపు మాట్లాడారు. "నీరుత్రాగినట్లు కనిపించదు, ఇంటికి తీసుకొనిపోయి, వేడికాఫీనిచ్చి, యుష్ణోపచారములు చేసిన చాలును" అనిచెప్పి వైద్యుడు నిష్క్రమించాడు రంగంలోనుంచి.

చేతులలో నోటుబుక్కులు, పౌంటెను పెన్నులు ధరించిన యిద్దరు పురుషులు రంగంలోకి ప్రవేశించారు. వచ్చినవారు స్వరూపాన్ని బట్టి వార్తాహరులై యుంటారని సరస్వతి వూహించి ధైర్యం వహించింది. కాని వచ్చినవారిరువురు సరస్వతివైపుగాని, దైన్యము వహించిన జోగారావు వైపునకు గాని పోవక, తడిబట్టలు విడచి, పొడియుత్తరీయమును ధరిస్తూవున్న ఆ నూతనపురుషుని దగ్గిరకి త్వరగాపోయి, "చిత్తం, చిత్తం రాఘవయ్యగారు! తమరిప్పు డిక్కడ నుంటారని ఎవ్వరనుకున్నారు?" అని తమనోటుబుక్కులలో ఏమేమో వ్రాయనుద్యుక్తులగుచుండ, సరస్వతి మనసులోనియాందోళనము వర్ణనాతీతము. ఆకపటనాటకం ముఖ్యపాత్రలనుకున్న తనభర్తవద్దకు గాని, తనవద్దకుగాని వారు రాక, ఈ "రాఘవయ్య" గారిదగ్గరికి ఎందుకు పోవాలో సరస్వతికి గోచరించలేదు. ఆనూతనపురుషుడు ఆశ్చర్యముతో వెనుకకు మరలిచూచి, కింకరులను పోలివున్న ఆరిపోర్టరుయుగము నెగాదిగా చూచి, పకపకమని యట్టహాసంచేశాడు. "స్వర్గమునకుపోయినా సవతిపోరు తప్పదని, మీ రెక్కడ దాపరించారయ్యా నాప్రాణంమీదికి?—"అని ప్రశ్నించాడు. అందుకువారు, "చిత్తం, చిత్తం ఆంధ్రలోకము నంతటా నాట్యకౌశలానికి గణుతికెక్కిన శ్రీరాఘవయ్యగారిని మే మెరుగకుంటామా?" అనిరి. ఇంతలో 'రాఘవయ్యగారు' జోగారావుండిన స్థలమునకువచ్చి, అతని కేవనెత్తి "నా కారు సిద్ధముగా పోస్టాఫీసువద్ద నున్నది. నాలుగడుగులువేసి, అందులోకూర్చొని, మీయింటికి పోదాం. అమ్మాయీ (సరస్వతితో) మాకు కాఫీయిచ్చే భారంనీది" అంటూ వారందరూ దగ్గరనే నిలచివున్న చక్కని మోటారు దగ్గరికి ప్రయాణమైనారు. రాఘవయ్యగారివెంట యిద్దరు రిపోర్టర్లూ కూడా వేటకుక్కలలాగు పడ్డారు; కాని ఆతడు వారివైపుచూచి, "ఇక నేనేమియు మీప్రశ్నలకుత్తరమీయజాలనందుకు చింతించుచున్నాను." అనినతోడనే వారిరువురు అచ్చటనే నిలువబడి రాఘవయ్యగారికి నమస్కరించి సెలవుతీసికొన్నారు. "కాలం మించిపోతూందని" సరస్వతివారివైపు చూచి, "అయ్యా! మీరు నన్నేమైన ప్రశ్నలడుగదలచియున్నారా?" అని ఆశాపూర్వకంగా ప్రశ్నించింది కాని, వారామెమాటలనైన వినిపించుకొనక "రాఘవయ్యగారు, ఈప్రదేశమున, ఈవేషములో!—ఎంతటి ఆశ్చర్యము!!" అని యేమేమో మాట్లాడుకుంటూ త్వరగా వెళ్లిపోయారు. సరస్వతి తెల్లమొగము వేసిందని మేము వేరుగాచెప్పాలా? "రాఘవయ్యో, గీగవయ్యో! ఇతడిప్పుడేల రావలెను? మాకార్యం భంగంచెయ్యడానికి" అని తన ఆశాభంగాన్ని అంతరంగముననే మ్రింగింది. వారు ముగ్గురూ మోటారుకారునెక్కి గృహోన్ముఖులైనారు.

3

ఇల్లుచేరినతోడనే వారు జోగారావునిబలవంతంగా మంచంమీద పరుండబెట్టి, అతనిమీద ఒక శాలువ కప్పారు. సరస్వతి నిప్పుచేసి, బొగ్గులపొయ్యిలోనిప్పేసి, కాఫీకినీళ్లు పెట్టింది. కొంతనిప్పు కుంపటిలోవేసి, రాఘవయ్యగారుచెప్పిన ప్రకారం, జోగారావు మంచంక్రింద పెట్టి, భర్తకుకాళ్లుపడుతూ మంచంమీద ఒకప్రక్కకి కూర్చుంది. రాఘవయ్యగారు ప్రక్కనున్న కుర్చీ లో కూర్చొని, కొంతసేవు అటుయిటు చూచి, గోడలకు తగిలించియున్న చిత్తరువుల యెడల తన ఉత్సాహం కనుబరుస్తూకూర్చున్నాడు.కొంతసేపటి కాతడు సరస్వతివైపుతిరిగి, "సరేకాని తల్లీ, మీభర్త జోగారావుగారు గోదావరిలో నేల పడెను?" అని ప్రశ్నించెను. ఇట్టి ప్రశ్నకు సరస్వతి సిద్ధపడియుండలేదు. "ఎట్లుపడెను?" అని ప్రశ్నించినచో, "ప్రమాదమున" అని ప్రత్యుత్తరమిచ్చేదికాని, "ఏలపడెను?" అను ప్రశ్న ఆమెను కొంత కలతబెట్టెను.అందుచేత సమాధానంచెప్పలేక పూరుకుంది.

రాఘు—దూరమునుంచి నేనంతా చూస్తూనే వున్నాను! మీభర్త బుద్ధిపూర్వకంగా నదిలోపడినది స్పష్టము! కారణము?

ఈ ప్రశ్న విని, ఆవర కూరకపండుకొనివున్న జోగారావుగారు రాని నిద్రనటించి గుర్రుపెట్ట నారంభించిరి. దాచిన ప్రయోజనములేదని యూహించి, సిగ్గుపడుచు సరస్వతి తనయొక్క బహిరంగత పన్నగడనంతయునుగూర్చి నిజస్థితి చెప్పేశింది.

రాఘువయ్యగారు కథనంతయువిని, "ఈసందర్భమున నాకు నవ్వు వస్తూన్నది! హా! హా! హా!

సర—(సిగ్గుపడుచు) ఏల?

రాఘు—విధి యెట్లు పనిచేయుచున్నదో మా చారా? ప్రచ్ఛన్నంగావుండి, కొన్నిదినాలైనా వృత్తి మార్గంవదలిపెట్టి దేశాటనంజేసి, ఎలాటి బహిరంగతలేకుండా, యానందిద్దామని నే నేదుస్తూంటే నన్ను న్యూసుపేపరు రిపోర్టర్లు పోల్చిపట్టుకోవడం, ప్రకటనకోసమని యింతపన్నాగంపన్నిన మీ కాశాభంగం కావడం చూస్తే నాకాశ్చర్యమవుతూంది. నిజంగా మనం అనుకున్నదానికి, ప్రపంచంలోజరిగేదానికీ హస్తిమశకాంతరం వ్యత్యాసంవుంది.

ఈ వాక్యాలు విని శాలువక్రింద ముఖందాచుకుని నిద్రవటిస్తూవున్న జోగారావుగారు, "ఈమట్టుక్రాణాలుపోతే బాగుండును!" అనుకున్నారు. సరస్వతి మనస్సులో సిగ్గుపడుతూనే వుందికాని, తన సూక్ష్మబుద్ధిని సహాయంతీసుకుని, తనకు సహజమైన సమయానుకూలవాచాలత్వముతో, "మాకాశాభంగ మెచ్చటిది? ఆంధ్రలోకములోని నటశేఖరులందరిలో అగ్రగణ్యుడని ప్రఖ్యాతివహించిన తమవంటివారు మాయింటికివచ్చి, మాచిన్న గూతిథ్యముపొంది, మాకథ విన్నతరువాత,మాకు బహిరంగతలేకేమి?" అని జవాబిచ్చింది. రాఘువయ్యగారు ఆమె మనసులోని భావాన్నిగ్రహించాడు. గది నలుదిక్కులా గోడలపైనున్న కొన్ని చిత్తరువులుతీసి పరీక్షించాడు. పిమ్మట "చిత్తరువులు చాలబాగున్నవి. స్వభావసిద్ధమైనవి. సృష్టికి ప్రతిసృష్టివలెనున్నవి. నీభర్త చిత్రకళాకౌశల మత్యద్భుతము! ప్రశంసార్హము!" అని పొగడుచు, "నేను కొన్ని చిత్తరువులు కొనెదను." అని పలికాడు.

* * * * *

మరునాటి ప్రాతఃకాలాన్ని సరస్వతి ఆంధ్రపత్రికలో ఈ క్రిందివిధంగా చదువుతూ మంచంమీద పరుండివున్న భర్తకు వినిపిస్తూంది.

' "సుప్రసిద్ధనాట్యాచార్యుడు, రాజమహేంద్రవరమున నొక చిత్రకళానిపుణుడగు యువకునిరక్షించుట! గోదావరిలో వంతెనపైనుండి భయంకరముగా దుమికి ప్రాణరక్షణము చేయుట.—" ఈ శీర్షికలక్రింద రెండు వ్యాసాలండి. తరువాత మనముగ్గురివి ఫొటోగ్రాఫులూనండి' అని సరస్వతి కాగితమును భర్తముఖమున కెదుటనుంచి చూపింది. జోగారావు ఆశ్చర్యముతో పేపరు చూచి, నవ్వి, "ఆఖరుకి మనకష్టం వృథాపోలేదన్నమాటే." అనెను.

సరస్వతి, మరలచదువుచు, 'ఈ రాఘవయ్యగారి, వ్యాసం వినండి. " * * * చిత్రకళాకుశలు డగు నీయువకుడు వి. జోగారావుగారు, నాచే నప్రయత్నంగా కనుగొనబడినందులకు నేనెంతయు సంత సించుచున్నాను. ఈతని చిత్తరువు లాంధ్రదేశమునకే కాక భారతజాతికంతకును వన్నెదెచ్చుననుటలో సంది యము లేదు. ప్రసిద్ధమగు నీకళకై పెగల నాకొలది యభిమానముజూపుటకును, అసామాన్యమైన పుణ్యమును వ్యక్తపరచిన శ్రీ జోగారావుగారిని చంద్రునకొక నూలుపోగిచ్చి సన్మానించు కరణి సమ్మానించుటకును మూడు చిత్తరువులను, మూడువేలరూప్యములకు ప్రతిగ్రహింప, నిశ్చయించితిని. అతిశీఘ్రకాలమున నాంధ్రలోక మీతని కౌశలమును గుర్తెరింగి యాతనిచిత్తరువులకై ప్రదర్శన మొకటి యేర్పరచి, గౌరవింతురని నమ్ముచున్నాను.—

యం. రాఘవయ్య." '

సరస్వతిచేతులోనుండి వార్తాపత్రిక అట్లే జారి క్రిందపడింది. ఆమెశిరము భర్తవక్షస్థలముపై వ్రాలింది. ఆనందబాష్పముల కడ్డులేదు. జోగారావు నవ్వునకు హద్దులేదు.

౪

వీథితలుపువద్ద వింతశబ్దం వారిని తమయానందపారవశ్యమునుండి మేల్కొలిపింది. సరస్వతి తలుపు తెరిచింది. ఇరువురు పురుషులు. వేరెవరునూకాదు; నిన్నటి న్యూసుపేపరురిపోర్టర్లు. జోగారావుయొక్క చరిత్ర వాళ్లకప్పుడే న్యూసుపేపర్లద్వారా వ్యక్తమైంది. ప్రసిద్ధపురుషులవెంట భట్రాజులలాగు పడడమే వృత్తిధర్మమైన న్యూసుపేపరు రిపోర్టర్సుకి, క్రొత్తగా కీర్తికాంతను వరించిన జోగారావుగారి దర్శనంచేసుకోవడం విధిగా వుంది. జోగారావుగారిని, వారి సతీమణి సరస్వతమ్మగారినిచూచి వారు సవినయంగా ప్రశ్నపరంపరను కురిపించారు. జోగారావుగారి చిత్రకళాచరిత్రనంతా తెలుసుకున్నారు. మరునాటి న్యూసుపేపర్లకు కావలిసినంత ఆహారమనుకుని నవ్వుకుంటూ వెళ్లిపోయారు. మూడు రోజులవరకు ఏన్యూసుపేపర్లోచూచినా, రాఘవయ్యగారు, జోగారావుగారు, శ్రీమతిసరస్వతిగారున్న్న రాజమహేంద్రవరంలో వున్న పెద్ద మనుష్యులంతా ఒకరొక్కరే వచ్చి జోగారావుగారి పరిచయంచేసుకుందికి ప్రయత్నించడం; ఎక్కడ చిత్రకళాప్రదర్శనంగాని, తత్కలావిషయ చర్చగాని జరగ వలసివుంటే శ్రీమాన్ జోగారావుగారే అధ్యక్షులు! — లోకం, అలాగువుంటుందండీ! — శుభముహూర్తాన్ని ప్రారంభమైన శుభం, అలాగు అక్షయమౌతూంటుందండి— జోగారావుగార్ని చూచి మూతులు త్రిప్పుకుంటూండే సాటిచిత్రకళాధురులు కూడా అతనివెంట తిరుగవలసి వచ్చింది! ఏంచెయ్యను? విధి విలాసము!

* * * * *

మరొక్క వత్సరంలో జోగారావు గారి పేరు ఆంధ్రదేశంలో పరిచితమైన పేరుగా ప్రతీయింటా తెలిసిపోయింది. దేనికైనా వేళరావాలి. మానుష యత్నం ఒకప్రక్కనుంచి జరుగుతూవుంటే, ఈశ్వరసంకల్పం యింకొక వైపునుంచి, బయలుదేరి దానికెదురై, రెంటిరాపిడికి కలిగిన తేజఃఖండమే 'కార్యసిద్ధి'అనిపించుకుంటూన్నది. రెండూ యెదురొక్కకపోతే యిక కార్యసిద్ధి అయ్యేదేముంది? ఒకప్పుడు పురుష యత్నంలో కూడానే దైవసంకల్పం బయలుదేరుతుంది. మరొకప్పుడు, ఏళ్లకొద్దీ ఆలస్యం అవుతుంది. మరికొన్ని సందర్భాలలో దైవకల్పన యీజన్మంలో వుండనే వుండదు. అప్పుడీరెండింటికీ మేళగింపు జన్మాంతరంలోనే.

* * * * *

జోగారావునకిప్పుడు యిరువురుపిల్లలు. మొదటిది పుత్రిక; పేరు రమణమ్మ! — రెండవ వాడు కుమారుడు; పేరు రాఘవయ్య! — ఎవరైనా "పేరేంటోయి?" అంటే "నాపేరా? నాపేరు రాఘవరావు!" అని వచ్చియు రానిమాటలతో ననుచుండును.